
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
ఆదివారం 5 జనవరి 2025





మాట్లాడుతున్న న్యాయాధికారి స్వాతిరెడ్డి





సిద్దిపేట పట్టణ పరిధి మైత్రివనం కాలనీలోని క్రాంతి హైస్కూల్ మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, మొదటి బహుమతి పొందిన ముగ్గు

ఇలపై ఇంద్రధనస్సు

సందడిగా ఆంధ్రజ్యోతి – ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

- సిద్దిపేట క్రాంతి హైస్కూల్ ఆవరణలో ఆకట్టుకున్న రంగవల్లులు
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన మహిళలు, యువతులు

సిద్దిపేట కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సప్తవర్ణాలు అవనిని సింగారించాయి. భువిపై రంగుల హరివిల్లు విరబూసినట్టుగా ముత్యాల ముగ్గులు మురిపించాయి. సంక్రాంతి పండుగను ముందే ఆవిష్కృతం చేశాయి. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సహకరించారు. సిద్దిపేట పట్టణం మైత్రివనం కాలనీలోని క్రాంతి హైస్కూల్ ఆవరణలో పండుగ వాతావరణంలో నిర్వహించారు. స్థానిక స్పాన్సర్‌గా క్రాంతి స్కూలు యాజమాన్యం వ్యవహరించింది. పోటీలకు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, పొరుగు మండలాలకు చెందిన మహిళలు, యువతులు అధికసంఖ్యలో హాజరై రంగవల్లులను తీర్చిదిద్దారు. 85 మంది మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గులు వేసిన తీరు, సందేశం, రంగులు, ఇతరత్రా వాటిని పరిశీలించి మార్కులు వేసి విజేతలను నిర్ణయించారు. ఈ సందర్భంగా క్రాంతి స్కూలు విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలు, భగవద్గీత శ్లోకాలతో ఆకట్టుకున్నారు. అనంతరం భోగి మంటలు వేసి సందడి చేశారు.

హాజరైన ప్రముఖులు

ముఖ్యఅతిథులుగా జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మహిళ పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గా, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య, ప్రముఖ వైద్యురాలు శిరీష, క్రాంతి స్కూలు చైర్‌పర్సన్ అర్పితాభగవాన్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో క్రాంతి పాఠశాల కరస్పాండెంట్ భగవాన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కుమారస్వామి, ఆంధ్రజ్యోతి ఉమ్మడి మెదక్ జిల్లా బ్యూరో ఇన్‌చార్జి అరుణ్ కుమార్, ఏబీఎన్, ఆంధ్రజ్యోతి సిబ్బంది, స్కూలు స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

పోటాపోటీగా సాగిన ఈ ముగ్గుల పోటీలో జక్కాపూర్ గ్రామానికి చెందిన యామిని ప్రథమ బహుమతిని దక్కించుకున్నది. ద్వితీయ విజేతగా అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన రమాదేవి, తృతీయ విజేతగా సిద్దిపేట పట్టణం మైత్రివనంకు చెందిన శ్రీలత నిలిచింది. మొదటి బహుమతి రూ.6 వేల నగదు, ద్వితీయ బహుమతి రూ.4వేల బహుమతి, తృతీయ బహుమతి రూ.3 వేల బహుమతితో పాటు మెమెంటోలను అందజేసి సత్కరించారు. వీరితో పాటుగా మరో ముగ్గురు హారిక, భాగ్య, యాదలక్ష్మీకి కన్సోలేషన్ బహుమతులను

మిగతా 8వ పేజీలో



చాలా సంతోషంగా ఉంది

ఇంతమంది పాల్గొన్న కార్యక్రమంలో నేను విజేతగా నిలవటం చాలా సంతోషంగా ఉంది. ఆంధ్రజ్యోతి పేపర్‌లో వచ్చిన అడ్వర్టజ్‌మెంట్ చూసి కార్యక్రమానికి వచ్చాను. చాలా మంది వచ్చారు. అందరిలో నేను మొదటి బహుమతి గెలవటం గ్రేట్‌గా అనిపిస్తుంది. ఇలాంటి కార్యక్రమాలు మరిన్నీ చేపట్టాలని ఆంధ్రజ్యోతి యాజమాన్యాన్ని కోరుతున్నాను.

- యామిని, మొదటి బహుమతి విజేత, జక్కాపూర్, సిద్దిపేట రూరల్ మండలం





అందరితో కలిసి పాల్గొనడం బాగనిపించింది

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ చేపట్టిన ఈ కార్యక్రమం చాలా బాగుంది. అందరితో కలిసి పాల్గొనడం బాగనిపించింది. ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన యాడ్ చూసి ముగ్గుల పోటీకి వచ్చాను. రెండో బహుమతి రావటం హ్యాపీగా ఉంది.

- రమాదేవి, ద్వితీయ బహుమతి విజేత జనగామ, అక్కన్నపేట మండలం





మహిళలకు స్ఫూర్తిదాయకంగా ఉంది

ఇలాంటి కార్యక్రమాలు మహిళలకు స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. మరిన్ని కార్యక్రమాలు చేపడితే బాగుంటుంది. ఇంట్లో ఉండే మహిళల ప్రతిభ వెలికితీయడానికి ఇదొక పెద్ద వేదికలా ఉపయోగపడతుంది. నిర్వాహకులకు ధన్యవాదాలు.

-శ్రీలత, తృతీయ బహుమతి విజేత, మైత్రివనం, సిద్దిపేట

మల్లన్న భక్తుల కాళ్లకు బొబ్బలు!

- గంగిరేగుచెట్టు ప్రాంగణంలో దెబ్బతిన్న ఫ్లోరింగ్
- ప్రదక్షిణ చేసే భక్తులకు ఇబ్బందులు



గంగిరేగుచెట్టు ఆవరణలో కుంగిన ఫ్లోరింగ్

చేర్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లిఖార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని మహిమాన్వితమైన గంగిరేగు చెట్టు ఆవరణలో ఫ్లోరింగ్ దెబ్బతినడంతో భక్తులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మల్లన్న దర్శనార్థం వచ్చిన భక్తులు తమ కోరికలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగుచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి ముడుపు కట్టడం ఆనవాయితీ. చెట్టు గద్దె ప్రాంగణంలో ఫ్లోరింగ్ పగుళ్లువారి కుంగిపోవడంతో ప్రదక్షిణ చేసే సమయంలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ అధికంగా ఉన్న సమయంలో పగుళ్ల, గుంతల్లో కాళ్లు పడి బొబ్బలు వస్తున్నాయి. దీనితోడు ఆహారం కోసం కోతులు దూసుకువస్తుండటంతో భయంతో వణికిపోతున్నారు. రాజగోపుర ప్రాకార ఆవరణలో నల్లాలు ఏర్పాటు చేసినా ఫినిషింగ్ చేయకపోవడంతో నీళ్లు కారుతూ దుర్వాసన కంపుకొడుతున్నది. భక్తులు ముక్కు మూసుకుని పట్నాల మొక్కులు తీర్చుకోవాల్సి వస్తున్నది. ఆలయ పరిధిలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పుకుంటున్నా.. ఎన్నో ఏళ్లగా కనీసం ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేపట్టకపోడంపై భక్తులు మండిపడుతున్నారు. జాతర ప్రారంభంకావడంతో మూడు నెలలు వేలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో అధికారులు తేరుకుని ఫ్లోరింగ్, నల్లా గద్దె మరమ్మతులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



నీటికులాయి లీకేజీ

కార్మికవర్గంపై పాలకవర్గాల దాడులు

- ప్రజా భాగస్వామ్యంతోనే ప్రైవేటీకరణ నియంత్రణ
- ఈఈఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్
- తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాలుగో మహాసభలు ప్రారంభం



మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్

సిద్దిపేట అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో పాలకవర్గాలు కార్మిక వర్గం హక్కులు, సౌకర్యాలు, చట్టాలపై దాడులు చేస్తున్నాయని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్ అన్నారు. శనివారం సిద్దిపేటలో ప్రారంభమైన తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌తో కలిసి సభను ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో మోదీ సర్కార్ విద్యుత్తు రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. కార్మికులను కట్టు బానిసలుగా మార్చడానికి ఆదానీ, అంబానీ లాంటివారికి దేశ సంపదను కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు చేస్తుందని మండిపడ్డారు. సోలార్, సంప్రదాయేతర ఇంధన వనరులను, విద్యుత్తు రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి చూస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు విద్యుత్ కార్మికుల గురించి ఎన్నో రకాల హామీలను ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయడం లేదన్నారు. విద్యుత్ చార్జీల నియంత్రణ కోసం, విద్యుత్తు రంగాన్ని కాపాడడానికి కామ్రేడ్ కిరణ్ జీపు జాత చేపట్టారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆర్టిజన్లను కన్వర్షన్ చేయించడానికి, పీస్ రేటు, మీటర్ రీడింగ్ చేసే వారిని రెగ్యులర్ చేయడానికి సీఐటీయూ కార్మికుల వెంట ఉందన్నారు. సంఘాలన్నీ ఐక్యంగా పోరాటం చేయడానికి సీఐటీయూ వారధి, సారధిగా ముందు ఉంటుందని, స్వతంత్రంగా పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. విద్యుత్ ఖర్చు ఎక్కువ అవుతుందని ఆ రంగాన్ని ప్రైవేటు కంపెనీకి అమ్మడానికి ప్రయత్నించగా దేశంలో ఆయా రాష్ట్రాల్లో సీఐటీయూ ఉద్యమాలను నిర్వహించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోనూ విద్యుత్ ప్రైవేట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించాలని, ప్రైవేట్ సోలార్ కంపెనీల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. దీంతో విద్యుత్తు రంగం కుట్టుపడే అవకాశం ఉందన్నారు. అనంతరం సభను ఉద్దేశించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, రాష్ట్ర అధ్యక్షుడు అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, గోపాలస్వామి, యూనియన్ గౌరవాధ్యక్షుడు కుమారాచారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాట మధు, యూనియన్ కంపెనీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంటుపల్లి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ర్యాకం అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్ల బండి శశిధర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రాడ్‌తో కొట్టి.. చీరతో ఉరేసి..

బాలికపై యువకుడి అఘాయిత్యం

- పెళ్లికి నిరాకరించిందని ఘాతుకం
- 13 రోజులుగా చికిత్స పొందుతూ మృతిచెందిన అమ్మాయి
- నంగునూరు మండలంలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

నంగునూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించాలంటూ బాలిక వెంటపడ్డాడు... వినకపోవడంతో ఆ అమ్మాయిని రాడ్‌తో కొట్టి చీరతో ఉరేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడో యువకుడు. చికిత్స పొందుతూ ఆ బాలిక శనివారం మృతి చెందింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలో జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబీకుల వివరాల ప్రకారం.. నంగునూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఎం.లక్ష్మణ్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమిస్తున్నానంటూ పది నెలలుగా వెంటపడుతున్నాడు. పెళ్లికి నిరాకరించడంతో నిందితుడు ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం డిసెంబరు 23న బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో లోనికి ప్రవేశించి ఆమెపై రాడ్‌తో దాడి చేసి చీరతో ఉరివేసి చంపేందుకు యత్నించాడు. ఈ క్రమంలో బాలిక అరుపులకు చుట్టుపక్కల వాళ్లు రావడంతో నిందితుడు పరారయ్యాడు. కొన ఊపిరితో ఉన్న బాలికను వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుడుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు చెప్పారు. కాగా నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- కలెక్టర్ మనుచౌదరి



హుస్నాబాద్‌లో జంక్షన్ల సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఎం.మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నో పనులను మంజూరు చేశారని తెలిపారు. ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, నేషనల్ హైవే, మున్సిపల్, తదితర ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన రహదారులు, డ్రైనేజీలు, భవనాలు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారికి అవసరమై పెండింగ్‌లో ఉన్న భూ సేకరణను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తదితరులున్నారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, నాగారం రోడ్డు చౌరస్తా, కరీంనగర్ రోడ్డు వై జంక్షన్, గాంధీచౌక్‌ల అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితతో కలిసి పరిశీలించారు.

నిషేధిత చైనా మాంజా వాడొద్దు :సీపీ

సిద్దిపేట క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ హెచ్చరించారు. జిల్లా పరిధిలో చైనా మాంజా విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చైనా మాంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. నైలాన్, సింథటిక్ దారాలు పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయని తెలిపారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలో చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. ఈ చైనా మాంజాను అమ్మినా, రవాణా చేసినా సమాచారం ఉంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు గాని డయల్ 100 గాని ఫోన్ చేసి తెలుపాలని సూచించారు.

మాదిగల్లో చైతన్యం అత్యవసరం

జహీరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మాదిగల్లో చైతన్యం అత్యవసరమని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహంమాదిగ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్ 'లక్ష డప్పులు-వేయి గొంతుకలు' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జహీరాబాద్ నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లేందుకు జాగృతం చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. అనంతరం జహీరాబాద్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏర్పుల టింకుమాదిగ, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్‌కుమార్, నర్సింహులు, ప్రధాన కార్యదర్శులుగా సుకుమార్‌పూలేను ఎన్నుకున్నారు.

'విద్యార్థులకు క్రమశిక్షణ అత్యవసరం'

జహీరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు క్రమశిక్షణ అత్యవసరమని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరీక్రిష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువుకోవాలని సూచించారు.

జాతీయస్థాయి రంగోత్సవ పోటీలకు 36 మంది

తూప్రాన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాల (వెల్దుర్తి) విద్యార్థులు జాతీయస్థాయి రంగోత్సవ పోటీలకు ఎంపికయ్యారు. గతనెలలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 177 మంది విద్యార్థులు గీసిన చిత్రాలను జాతీయస్థాయి రంగోత్సవ నిర్వహణకు పంపగా.. 36 మంది ఎంపికయ్యారు. గురుకులంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభచూపిన విద్యార్థులకు ఎంఈవో సత్యనారాయణ షీల్డ్‌లను అందజేశారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

రామాయంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యారంగ పరిరక్షణకు మరిన్ని పోరాటాలు తప్పవని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ పిలుపునిచ్చారు. రామాయంపేటలో శనివారం జరిగిన 29వ జిల్లా మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. ఇప్పటికే రూ.8,220 కోట్ల విద్యార్థుల స్కాలర్‌షిప్స్ పేరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.



సిద్దిపేట : ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



సిద్దిపేట : మొదటి బహుమతి గెలుచుకున్న యామినికి మెమెంటో, నగదు అందజేస్తున్న అతిథులు



సిద్దిపేట : రెండో బహుమతి గెలుచుకున్న రమాదేవికి మెమెంటో, నగదు అందజేస్తున్న అతిథులు


సిద్దిపేట : రెండో బహుమతి గెలుచుకున్న శ్రీలతకు మెమెంటో, నగదు అందజేస్తున్న అతిథులు


సిద్దిపేట: భోగిమంట వేస్తూ..


సిద్దిపేట పట్టణం మైత్రివనం కాలనీలోని క్రాంతి హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



పండగలా..

అమ్మవారి రూపాలు, మన ఊరి బసవన్నలు, సంక్రాంతి గంగిరెద్దులు, ధాన్యపు రాశులు, నవ ధాన్యాలు, గొబ్బెమ్మలతో సంక్రాంతి ముందుగానే వచ్చిందా అనేలా ముత్యాల ముగ్గులు ఆకట్టుకున్నాయి. పండుగ సంబరమే కాకుండా సామాజిక అంశాలను మేళవించి వేసిన రంగవల్లులు కనువిందు చేశాయి. మహిళా శక్తి ప్రతిబింబించేలా, సామాజిక చైతన్యం ఉట్టి పడేలా వివిధ రంగులతో ముగ్గులను అందంగా తీర్చిదిద్దారు.

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) శనివారం మెదక్, సిద్దిపేట జిల్లా కేంద్రాల్లో పండగ వాతావరణంలో జరిగాయి. సిద్దిపేట పట్టణం మైత్రివనం కాలనీలోని క్రాంతి హైస్కూల్ ఆవరణలో, మెదక్ పట్టణం వెంకట్‌రావునగర్‌లోని సిద్ధార్థ మోడల్ స్కూల్ ఆవరణలో పోటీలను నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు హాజరై ముగ్గులు వేశారు. న్యాయ నిర్ణేతలు అన్ని రంగవల్లులను పరిశీలించి విజేతలను ప్రకటించగా, అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.


మెదక్ పట్టణం వెంకట్రావునగర్‌లోని సిద్ధార్థ మోడల్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


మెదక్ :మొదటి బహుమతి గెలుచుకున్న మాలతికి నగదు అందజేస్తున్న అతిథులు


మెదక్ : ద్వితీయ బహుమతి గెలుచుకున్న శ్వేతకు నగదు అందజేస్తున్న అతిథులు


మెదక్ : తృతీయ బహుమతి గెలుచుకున్న సౌమ్యకు నగదు అందజేస్తున్న అతిథులు


మెదక్ : పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ మహేందర్, అదనపు కలెక్టర్ నగేశ్



మెదక్ : ముగ్గు వేస్తున్న విద్యార్థినులు


కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యులు

ధనుర్మాస ఉత్సవాలకు 'వైకుంఠపురం' ముస్తాబు

● రేపు శ్రీవారి రథయాత్ర, 10న వైకుంఠ ఏకాదశి

సంగారెడ్డి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస ఉత్సవాలకు వైకుంఠపురం దేవాలయం ముస్తాబైందని ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యులు తెలిపారు. సంగారెడ్డి శివారులోని ఆ దేవాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. ఈ నెల 6న యువ వికాస్ ఆధ్వర్యంలో శ్రీవారి రథయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 11న వైకుంఠ ద్వాదశి, 12 న కూడారై(1008 క్షీరాన్న ప్రసాద నివేదన), 13న గోదారంగ నాథుల కల్యాణం, 14 ఏకాంత సేవ(ఊంజల్), 15 న సర్వమంగళా దేవీ ఆవిర్భావ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దేవేందర్, వీరేందర్, అశ్వంత్, సంతోష్, ద్వారకా రవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్


ముస్తాబైన బాగారెడ్డి స్టేడియం

జహీరాబాద్, జనవరి4 (ఆంధ్రజ్యోతి) : అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌కు జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్ ముస్తాబైంది. ఈ నెల 5 నుంచి 14 వరకు జరగనున్న ఈ టర్నీమెంట్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు ఖిజార్ యాఫై, కమిటీసభ్యులు తెలిపారు. గెలుపొందిన జట్టుకు రూ.6.11 లక్షలు, రన్నరప్ జట్టుకు రూ.3.55 లక్షలు బహుమతిగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 16 జట్లు పాల్గొంటాయని, రోజువారీగా ఆయా జట్లకు ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.

ఎముకలు కొరికే చలి..

● వణుకుతున్న ఉమ్మడి జిల్లా
● రాష్ట్రంలోనే కోహీర్‌లో అత్యల్పంగా 6.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు


కోహీర్‌లో చలి మంట వేసుకున్న యువకులు

కోహీర్, జనవరి 4: (ఆంధ్రజ్యోతి) గత నాలుగు రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లా చలికి గజగజ వణికిపోతున్నది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోతుండడం.. దీనికి తోడు శీతల గాలులు వీయడంతో ఎముకలు కొరికేలా చలి తీవ్రత పెరుగుతున్నది. శనివారం ఉదయం రాష్ట్రంలోనే కోహీర్‌లో 6.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే న్యాల్‌కల్ మండలంలో 6.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా, మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని బోడగట్‌లో 8.4 ఉష్ణోగ్రత నమోదైంది. ఇక సిద్దిపేట జిల్లాలోని మర్కుక్ మండలం అంగడికిష్టాపూర్‌లో 9.2 ఉష్ణోగ్రత నమోదైంది. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంతో పాటు న్యాల్‌కల్ మండలంపై చలి ప్రభావం అత్యధికంగా కనపడుతున్నది. రాష్ట్రంలో ఈశాన్య గాలులు చురుకుగా వీస్తుండడంతో చలి తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణం శాఖ సూచిస్తుంది. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్, న్యాల్కల్ మండలాల్లో ప్రతి సంవత్సరం అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత ఐదేళ్లుగా కోహీర్ మండలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయికి పడిపోతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కాగా కోహీర్‌లో నాలుగు రోజులుగా ఉష్ణోగ్రత సింగిల్ డిజిట్‌కు పడిపోయింది. శనివారం కోహీర్‌లో 6.0 ఉష్ణోగ్రత నమోదు కాగా, ఈ సీజన్‌లో ఇదే తక్కువ.

ఉమ్మడి జిల్లాలోని ఉష్ణోగ్రత వివరాలు..

సంగారెడ్డి జిల్లాలో కోహీర్ 6.0, న్యాల్‌కల్ 6.3, అల్మాయిపేట్‌లో 7.3, మల్‌చేల్మ7.5, నల్లవల్లి 7.7 అల్గోల్ 7.9, సత్వార్ 8.1, ఆర్.సిపురం 8.2, లక్ష్మీసాగర్ 8.2, మొగుడంపల్లి 8.3, నిజాంపేట్ 8.3, ఝరాసంగం 8.7, మునీపల్లి 9.0, జహీరాబాద్‌లో 9.1, అన్నసాగర్ 9.3, ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లాలోని బోడగట్ 8.4, మనోహర్‌బాద్ 9.1, శివ్వంపేట్ 9.4, నార్సింగి 9.7, కొల్చారం 9.8 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక సిద్దిపేట జిల్లాలోని మర్కుక్ మండలంలోని అంగడికిష్టాపూర్‌లో 9.2, అక్బర్‌పేట్‌భూంపల్లి మండలంలోని పోతరెడ్డిపేట్‌లో10.0 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఏటీఎం కార్డు మార్చి డబ్బులు కాజేశాడు

తూప్రాన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డును మార్చేసి డబ్బులు కాజేసిన సంఘటన తూప్రాన్ పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం తూప్రాన్ మండలం దాతర్‌పల్లి గ్రామానికి చెందిన చింతల శ్రీనివాస్ శనివారం మధ్యాహ్నం తూప్రాన్ ఎస్‌బీఐ పక్కనే ఉన్న ఏటీఎం కేంద్రంలో డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లాడు. డ్రాకు ప్రయత్నించగా డబ్బులు రాకపోవడంతో పక్కనే ఉన్న గుర్తు తెలియని వ్యక్తికి కార్డు ఇచ్చి చూడమని చెప్పాడు. డబ్బులు తీస్తున్నట్లు ప్రయత్నించి రావడంలేదంటూ ఏటీఎం కార్డు మార్చి ఇచ్చి వెళ్లిపోయాడు. శ్రీనివాస్ మరో ఏటీఎంకి వెళ్లి డ్రా చేసేందుకు ప్రయత్నించగా, కార్డు అతడిది కాదని గుర్తించాడు. దీంతో ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లి ఖాతాను పరిశీలించగా రూ. 42వేలు డ్రా చేసినట్లు గుర్తించాడు. ఈ విషయంలో బాధితుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కేతకీలో ఎస్పీ రూపేష్ పూజలు

ఝరాసంగం, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో శనివారం జిల్లా ఎస్పీ రూపేష్ కుటుంబ సమేతంగా పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అధికారులు ఎస్పీకి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

ఉత్సాహంగా సైక్లింగ్ ర్యాలీ

● ప్రారంభించిన మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్


సైక్లింగ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

మెదక్ అర్బన్, జనవరి 4: రోజూ అరగంట సైక్లింగ్ చేయడం ఆరోగ్యదాయకమని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. శనివారం సిద్దార్థ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన సైక్లింగ్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. పట్టణంలోని వెంకట్రావ్‌నగర్ కాలనీలో మొదలైన ర్యాలీను డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైక్లింగ్ చేస్తే మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతామన్నారు. రోడ్డుపై వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చన్నారు. హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ సభ్యులు కోటేశ్వరరావు మాట్లాడుతూ.. నాకు 73 ఏళ్ల వయసు ఉన్నప్పటికీ నిత్యం సైక్లింగ్ చేయడంతో ఆరోగ్యంగా ఉన్నానన్నారు. సైక్లింగ్‌తో కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి హెల్మెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన జిల్లా సైక్లిస్టులు

సిద్దిపేట కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ జిల్లా మల్కాజిగిరిలో ఈ నెల 5 నుంచి 7 వరకు జరిగే రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. అండర్ 14, అండర్ 17 బాలికల విభాగంలో రిజ్వాన, అంకిత, లిఖిత, వర్షిత, శీలం శ్రీనిధి, మద్దెల సంజన, జంగపల్లి రేణుక, సాయిప్రసన్న, బాలుర విభాగంలో నీలం జశ్వంత్, బళ్ల నిఖిల్, బి. ప్రసాద్, జి. చరణ్, అవన్‌రెడ్డి ఎంపికైనట్లు రాష్ట్ర స్థాయి క్రీడా సమాఖ్య అధికారులు తెలిపారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన జిల్లా సైక్లిస్టులు

ఆర్టీఏ మెంబర్‌గా నర్సింగరావు



చేర్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ జనగామ జిల్లా సభ్యుడిగా చేర్యాల పట్టణానికి చెందిన మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు నియామకమయ్యారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలవారీగా 33మంది ఆర్టీఏ మెంబర్లను నియమించిన క్రమంలో జనగామ జిల్లాకు సంబంధించి కొమ్ము నర్సింగరావుకు ప్రాధాన్యం కల్పించారు. తెలంగాణ ఉద్యమకాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యంత మెజారిటీతో జడ్పీటీసీగా గెలుపొందిన కొమ్ము నర్సింగరావు కాంగ్రెస్‌లో వివిధ హోదాలలో పనిచేశారు. అంతేకాకుండా అతడి సతీమణి కొమ్మురాజేశ్వరి గతంలో ఎంపీటీసీగా గెలుపొందారు.



రైతుబజార్ ముస్తాబు

● నేడు ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ పట్టణంలోని చావడి వద్ద నిర్మించిన రైతు బజార్‌ను ఆదివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. రూ. 2.53 కోట్లతో నిర్మించిన రైతు బజార్‌కు గత ఆరు సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేశారు. పలు సమస్యలతో దీని పనులు ఆగుతూ సాగాయి. దీనికి మార్కెట్ శాఖ నుంచి నిధులు కేటాయించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో రైతు బజార్‌కు, ఫస్ట్‌ఫ్లోర్‌లో ఫంక్షన్‌హాల్, సెకండ్ ఫ్లోర్‌లో కిచెన్, డైనింగ్‌హాల్, స్టోర్ రూమ్ నిర్మాణం చేశారు. ఎట్టకేలకు రైతు బజార్‌ను ప్రారంభిస్తుండటంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే 6, 7 ,11 , 12, 13, 17, 19 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం శంకుస్థాపన చేయనున్నారు.

- హుస్నాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి)

నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి



చేర్యాలలో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల/మద్దూరు/దూళిమిట్ట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా నియోజకవర్గం అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి, చిత్తశుద్ధితో పాటుపడతానని, ప్రజలు ఎప్పుడు తనను పిలిచినా వాలిపోతానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే పలు మండలాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. చేర్యాలపట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో చేర్యాల, కొమురవెల్లి మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో నీలిమ ఆస్పత్రిలో ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఏడాదికాలంలో వెయ్యి మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించామన్నారు. గోదావరి జలాలలను గండి రామారం, లద్నూరు, తపాస్‌పల్లి రిజర్వాయర్‌లతో పాటు చెరువులు నింపుతున్నామన్నారు. అదేవిధంగా దూళిమిట్ట తహసీల్ కార్యాలయంలో 36 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను, 4 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు.

అందరి నోటా తులం బంగారం మాటే..

మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దారు ఏజే రహీం అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా ముఖ్య అతిథిగా హాజరై కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో 16 కల్యాణలక్ష్మి, 2 షాదీముబారక్, మరో 16మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మికి సంబంధించిన తులం బంగారం ఎప్పుడిస్తారని అందరూ అడుగుతున్నారన్నారు. ఎప్పుడిస్తారోననే అందరి మనసులోని మాటను ప్రభుత్వ ప్రతినిధులుగా ఉన్న అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన లద్నూరు గ్రామ మాజీ సర్పంచ్ దండు సోమక్కసోమయ్య దంపతులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు. చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి జింకలపర్వతాలు యాదవ్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

వానరానికి అంత్యక్రియలు



కుకునూరుపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వానరానికి అంత్యక్రియలు చేసి యువకులు ఉదారతను చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలో శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ కోతి మృతి చెందింది. ఇది గమనించిన శివాజీ యూత్ సభ్యులు మరణించిన వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సంతోష్, రాజేశ్, మహేష్‌గౌడ్, ఆకాష్, సాయి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌తో జీవితాన్ని పాడుచేసుకోవద్దు

చిన్నకోడూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్స్ ఆడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు సూచించారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది హెడ్ క్వార్టర్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, మొక్కల చుట్టూ ఉన్న గడ్డి పొదలను తొలగించారు. అనంతరం ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బందితో ఇంట్రాక్టివ్ సెషన్ నిర్వహించి మాట్లాడారు.కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణచందర్, ధరణికుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందమైన చేతిరాతతో మంచి మార్కులు

చిన్నకోడూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో మంచి ప్రతిభ కనబర్చడంతో పాటు, చేతి రాత చక్కగా ఉంటే పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చని మండల విద్యాధికారి యాదవరెడ్డి సూచించారు. చిన్నకోడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు అందమైన చేతిరాతపై పోటీ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అక్షరాలను అందంగా, అక్షర దోషాలు లేకుండా, విరామ చిహ్నాలు ఉపయోగిస్తూ తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో సూచించిన మొత్తం పాఠ్యాంశాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేశారు. దస్తూరిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇలపై ఇంద్రధనస్సు

(5వ పేజీ తరువాయి)

అందజేశారు. అంతేకాకుండా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ గిఫ్టులు అందించారు.

అందమైన ముగ్గులా జీవితాన్ని మార్చుకోవాలి

- స్వాతి రెడ్డి, జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల కార్యక్రమం బాగుంది. మహిళలందరినీ ఒక చోట చేర్చి వారిలో పోటీతత్వం పెంచేలా కార్యక్రమం రూపొందించారు. చుక్కలన్నింటిని కలుపుతూ వేసిన అందమైన ముగ్గులా మహిళలు తమ జీవితాన్ని మార్చుకోవాలి. చిన్నచిన్న కష్టాలకు కుంగిపోకుండా ధైర్యంగా ముందుకెళ్లాలి. కష్టాలు వస్తేనే జీవితంలో నిలదొక్కుకుంటాం. ఏవైనా న్యాయపరమైన సమస్యలుంటే మహిళలు 15100 నెంబర్ కాల్ చేసి న్యాయ సహాయం పొందవచ్చు.

రంగవల్లులు ఆకట్టుకున్నాయి

- మంజులారాజనర్సు, మున్సిపల్ చైర్‌పర్సన్

ముగ్గుల పోటీ కార్యక్రమం చాలా బాగుంది. సంక్రాంతికి ముందే పండుగ వాతవరణం నెలకొన్నది. ప్రతి ఒక్కరూ అందంగా ముగ్గులు తీర్చిదిద్దారు. ఒకొక్క ముగ్గు ఒక ప్రత్యేకతను కల్గి ఉంది. కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులకు, పాల్గొన్న వారందరికీ అభినందనలు.

పోటీతత్వం పెరుగుతుంది

- రోజాశర్మ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్

ఇలాంటి కార్యక్రమాలతో మహిళల్లో పోటీతత్వం పెరుగుతుంది. సంస్కృతీ సంప్రదాయాలను ముందు తరాలకు తీసుకెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయి. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు మండలాలు, గ్రామ స్థాయిలో తీసుకెళ్లాలని ఆంధ్రజ్యోతి వారిని కోరుతున్నాను.

సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఉంది

- దుర్గా, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ

ఈ ముత్యాల ముగ్గుల కార్యక్రమం సంస్కృతి సంప్రదాయలను ప్రతిబింబించేలా ఉంది. నిర్వాహకులకు అభినందనలు. పాల్గొన్న మహిళలకు, యువతులకు అభినందనలు.

నిత్య జీవితంలో ఒత్తిడులు దూరమవుతాయి

- సౌందర్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి

ఇలాంటి కార్యక్రమాలతో ప్రతిరోజూ ఇంటిపనులు, ఉద్యోగ బాధ్యతలతో ఒత్తిడికి గురువుతున్న మహిళలకు ఉపయోగంగా ఉంటుంది. వంటింటికే పరిమితం కాకుండా ఇలాంటి కార్యక్రమాల వల్ల తమ ప్రతిభను చాటినవారవుతారు.

గెలుపోటములు కాదు.. పాల్గొనడమే ముఖ్యం

- డా.శిరీష, ప్రముఖ వైద్యురాలు

మహిళల కోసం ఇంత మంచి కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులకు అభినందనలు. గెలవటం, ఓడిపోవటం ముఖ్యం కాదు. కార్యక్రమంలో పాల్గొనడం ప్రధానం. ప్రస్తుతం వస్తున్న అనారోగ్య సమస్యల గురించి మహిళలకు అవగాహన అవసరం. హెల్తీ అండ్ హైజిన్ ఆహారం తీసుకుంటూ ఫ్యామిలీకి అందేలా చూడాలి. చాలామంది సర్వైకల్ కేన్సర్‌తో ఇబ్బంది పడుతున్నారు. ముందస్తుగా జాగత్తలు పాటిస్తే బాగుంటుంది.

నేడు తునికిబొల్లారం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తునికిబొల్లారం సబ్‌స్టేషన్ 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 5న మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, తిరిగి యధావిధిగా విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణ సమీపంలో ఉన్న జీఎంఆర్ పాలిటెక్నిక్ హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాచారం శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం యూఎస్‌ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో మెస్ బిల్లులు కట్టలేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

అందుబాటులో గ్రంథాలయాలు

సిద్దిపేట కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అందరికీ అందుబాటులో గ్రంథాలయాలు ఉండేలా చూస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి చెప్పారు. శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సిద్దిపేట జిల్లా పరిధిలోని గ్రంథాలయాల అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేశారు.

మృతుడి కుటుంబానికి సాయం

చేర్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కరువై ఆర్థిక ఇబ్బందులకు తాళలేక కొమురవెల్లి మండలం మర్రిముస్యాల గ్రామానికి చెందిన ఆటోకార్మికుడు తలారి బాలనర్సు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడం పట్ల మాజీసర్పంచు బొడ్గం పద్మకృష్ణారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు.

నెంటూర్‌లో హరిహర లిఖిత మహాయజ్ఞం



శ్రీరామ, శివ నామాలను లిఖించిన పత్రాలను చూపుతున్న నెంటూర్ గ్రామస్థులు

వర్గల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం శృంగేరి పీఠం చేట్టిన హరిహర లిఖిత మహాయజ్ఞం శనివారం వర్గల్ మండలం నెంటూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని గజ్వేల్ శ్రీరామకోటి భక్త సమాజం, ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు రామకోటి రామరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద గ్రామస్థులతో శ్రీరామనామ స్మరణ చేయిస్తూ శ్రీరామ, శివ నామాలను లిఖింపజేశారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో కోట్లాది లిఖిత సంఖ్యకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను సందర్శించి వందలాది భక్తులతో శ్రీరామ, శివ నామాలను లిఖింపజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రామరాజును గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ఆలయ అర్చకులు యాయవరం శ్రీధర్ శర్మ, స్థానిక నాయకులు వెంకటయ్య, షాదుల్లాగౌడ్, రాఘవరెడ్డి, శ్రీరాములు, లక్ష్మారెడ్డి, బాలమల్లయ్య, హనుమాన్ భక్త బృందంతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు భద్రతను పాటించాలి



చేర్యాలలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంవీఐ క్రిస్టోఫర్

గజ్వేల్/చేర్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత పాటించాలని చేర్యాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రిస్టోఫర్ అన్నారు. జాతీయరోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోలో డ్రైవర్లకు, చేర్యాలలో వాహనదారులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్‌డిపోలో ఎంవీఐ క్రిస్టోఫర్ మాట్లాడుతూ..డ్రైవర్లు సరిపడా విశ్రాంతిని తీసుకోవాలని, దీంతో ఆరోగ్యంగా ఉంటారని తద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. డ్రైవర్లు సెల్‌ఫోన్ డ్రైవింగ్ మానుకోవాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అనుసరించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పవన్, అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, ఎంఎఫ్ జమీల్, ఏఎంఎఫ్ శ్యాంసుందర్, సెఫ్టీ వార్డెన్, డిపో సిబ్బంది పాల్గొన్నారు. చేర్యాల పట్టణంలో జాతీయరోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని అంగడిబజారు చౌరస్తావద్ద ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. ప్రతీ వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

మద్యంసేవించి వాహనాలు నడపకూడదనిసూచించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ జయలక్ష్మి, హోంగార్డ్ నరేశ్, కంప్యూటర్ ఆపరేటర్ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ముగిసిన 'ఏఐ' జాతీయ సదస్సు



సర్టిఫికెట్ అందుకుంటున్న పరిశోధన విద్యార్థిని, సదస్సులో పాల్గొన్న అధ్యాపక బృందం

సిద్దిపేట కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ జాతీయ సదస్సు శనివారం ముగిసింది. మైక్రో బయాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సౌజన్యంతో 2 రోజులపాటు ఈ సదస్సు నిర్వహించారు. రెండో రోజు ముఖ్య అతిథిగా హాజరైన డైటీషియన్, న్యూట్రీషియనిస్టు దీప్తి కాచం, ప్రిన్సిపాల్ సునీత సదస్సును ఉద్దేశించి మాట్లాడారు. జాతీయ సదస్సు ద్వారా విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకున్నారని వివరించారు. రెండు రోజులపాటు జరిగిన సదస్సులో ఏడుగురు వక్తలు వివిధ రంగాల్లో కృతిమ మేధ ఉపయోగాలను, పరిమితులను చర్చిస్తూ ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పరిశోధకులు, విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. సదస్సులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పరిశోధకులను, అధ్యాపకులను సత్కరించారు. జాతీయ సదస్సు కార్యదర్శి డా. మదన్‌మోహన్, కన్వీనర్ శ్రీనివాసరెడ్డిని అభినందించి సన్మానం చేశారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను దహనం చేసిన నిందితుడికి రిమాండ్

మిరుదొడ్డి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో గత నెల 25న గోల్కొండ ప్రైవేటు పాఠశాలకు చెందిన రెండు వాహనాలను దహనం కేసులో నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శనివారం భూంపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు వీరారెడ్డి గ్రామానికే చెందిన గ్రామానికి చెందిన సర్దార్ పాషా(29)అనే వ్యక్తి పాతకక్షలను పెట్టుకుని రవి ఇంటి ముందు పార్కు చేసిన వాహనాలపై బైక్‌లోని పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దర్యాప్తు అనంతరం పోలీసులు సర్దార్ పాషాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

మహిళపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

మిరుదొడ్డి,జనవరి4(ఆంధ్రజ్యోతి): మహిళపై దాడి కేసులో కనకయ్య అనే వ్యక్తిపై రౌడీషీటర్ కేసును నమోదు చేసినట్టు అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐ హరీశ్ తెలిపారు. శనివారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం కూడవెల్లి గ్రామానికి చెందిన కళావతిపై నిందితుడు రాళ్లతో దాడి చేసినట్టు తెలిపారు. కళావతి పొలాన్ని కౌలుకు చేస్తున్న మంజులను కనకయ్య అనే వ్యక్తి బూతులు తిట్టడంతో పాటు రాళ్లతో దాడిచేశాడని తెలిపారు. బాధిత మహిళ ఫిర్యాదుమేరకు రౌడీషీటర్ కేసు నమోదు చేసి, రిమాండ్ తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న ఇసుక వేలం

ధూళిమిట్ట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. శనివారం తహసీల్దార్ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన మెతుకు రామక్రిష్ణారెడ్డి ఎలాంటి అనుమతులు లేకుండా తన వ్యవసాయ భూమి నిల్వ చేసిన దాదాపు 16 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకుని గ్రామ పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణం మోడల్ స్కూల్ సమీపంలోని సర్వే నెంబర్ 93లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి అందులో మట్టి పోసి విక్రయానికి సిద్ద పడిన రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని శనివారం జిల్లా కలెక్టర్ మను చౌదరికి ఫిర్యాదు చేసినట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ తెలిపారు. అనంతరం ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించినట్లు చెప్పారు. మల్లేశ్ వెంట సీపీఐ నాయకులు అయిలేని సంజీవరెడ్డి, జనగామ రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి జగ్గు మల్లారెడ్డి

సిద్దిపేట అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి సమస్యలను పరిష్కరించాలని పేస్కేల్ చెల్లించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన శనివారం నాటికి 26వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడు కరీంనగర్ నియోజకవర్గం టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి జగ్గు మల్లారెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. సుమారు నెలరోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రతినిధులు రవీందర్ రెడ్డి, సికిందర్, బాలకృష్ణ, సంతోష్, వెంకటేష్, సాగర్, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక శాస్త్రం జిల్లాస్థాయి ప్రతిభా పరీక్ష

సిద్దిపేట కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సాంఘికశాస్త్ర ప్రతిభాపాటవ పరీక్ష (సోషల్ టాలెంట్ టెస్ట్) శనివారం సిద్దిపేటలోని టీజీసీ భవన్‌లో జరిగాయి. సిద్దిపేట జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు. జిల్లా పరిషత్ విభాగం, కేజీబీవీ, టీఎస్ఎంఎస్ విభాగంలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలవారీగా పరీక్ష నిర్వహించారు. డీసీఈబీ సెక్రటరీ శౌకత్ ఆలీ, జిల్లా ప్రభుత్వ విభాగం అసిస్టెంట్ కంట్రోలర్ లక్ష్మయ్య, సిద్దిపేట అర్బన్ ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి పరీక్ష పత్రాలను విడుదల చేశారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికవుతారని నిర్వాహకులు తెలిపారు. జిల్లా సోషల్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడు మామిడి పూర్ణచంద్రరావు, గౌరవాధ్యక్షుడు మామిండ్ల లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి గుండా వేణుమాధవ్, జిల్లా అధ్యక్షుడు బాలరాజు, సోషల్ ఫోరం ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'స్వయంపాలన'తో బాధ్యతలు తెలుస్తాయి



స్వయంపాలన కార్యక్రమంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొండపాక, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు స్వయం పరిపాలనతో బాధ్యతలను గుర్తిస్తారని కొండపాక మండలం మర్పడగ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భైరయ్య పేర్కొన్నారు. శనివారం పాఠశాల విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా వి.మహాలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారిగా ఉమర్, ప్రధానోపాధ్యాయులుగా ఎస్. అభివర్షిక, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు

'పంచతంత్ర'లో కంటివైద్య శిబిరం

చేర్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని పంచతంత్ర పాఠశాలలో శనివారం విద్యార్థులకు కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రిషి క్లినిక్ సిబ్బంది విద్యార్థులకు కంటివైద్య పరీక్షలు జరిపారు. లోపాలు ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులకు తగు సూచనలు చేశారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

గజ్వేల్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోను కాకుండా ఉండడం కోసం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ ప్రోగ్రాం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హార్ట్‌ఫుల్‌నెస్ ప్రోగ్రాం స్పీకర్ శ్రీవడ్డెపల్లి నగేష్ మాట్లాడుతూ పరీక్షల వేళ విద్యార్థినులు మానసిక స్థైర్యంతో ఉంటూ, మెడిటేషన్ తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ జ్యోతిర్మయి మాట్లాడుతూ విద్యార్థినులందరూ ఏకాగ్రతతో చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల స్టూడెంట్ కౌన్సిల్ శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో అందెభాస్కర్‌కు అవకాశం



ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ఎంపికైన భాస్కర్

మిరుదొడ్డి, జనవరి4(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్ డప్పు కళాబృందానికి అవకాశం కల్పించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను అవకాశం కల్పించడం పట్ల భారతసంగీత నాటక అకాడమీకి, ప్రధాన మంత్రి మోదీకి కృతజ్ఞతలను తెలిపారు.